# సాక్షి ఖమ్మం

బుధవారం । 8 । జనవరి । 2025






## సుందరరూపం..

భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా స్వామి వారు బలరామావతారంలో దర్శనమిచ్చారు. 8లో



## చకచకా నిర్మాణం

కూసుమంచి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. 8లో

గరిష్టం / కనిష్టం

30° / 15°

## వాతావరణం

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త పెరిగే అవకాశముంది. ఉదయం, రాత్రి మాత్రం చలి తీవ్రత ఉంటుంది.

# మమ్మల్ని ఆపేదెవరు?!



ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం జిల్లాలోని పలుచోట్ల పక్కదారి పడుతోంది. రేషన్ దుకాణాల్లోనే మొదలవుతున్న ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇందులో డీలర్లు, దళారులు మొదలు బడా వ్యాపారుల వరకు భాగస్వాములుగా ఉంటున్నట్లు తెలుస్తోంది. అయితే, పీడీఎస్ బియ్యం జాతీయ రహదారుల మీదుగా వాహనాల్లో తరలిస్తున్నా పోలీసు, రెవెన్యూ అధికారులు తమకు గుర్తొచ్చినప్పుడు దాడులు చేసి ఆ తర్వాత 'మామూలు'గా వదిలేస్తున్నారు. ఇలా 2024 ఏడాదిలో 97 కేసులు నమోదు చేసి 2,949.81 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. ప్రస్తుతం గత రెండు రోజుల్లోనే భారీగా రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారంటే పట్టుబడకుండా అక్రమార్కులు ఎంత బియ్యాన్ని తరలించారో అర్థం చేసుకోవచ్చు. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం

### జిల్లా మీదుగా పీడీఎస్ బియ్యం తరలింపు

- డీలర్లు, లబ్ధిదారుల నుంచి సేకరణ.. ఎగుమతి
- దందాలో రూ.కోట్లు దండుకుంటున్న వ్యాపారులు
- అడపాదడపా దాడులతో సరిపెడుతున్న యంత్రాంగం



ఖమ్మం ఇండస్ట్రియల్ ఏరియాలోని గోదాంలో మంగళవారం స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

**బియ్యమా.. డబ్బులా?**

రేషన్ దుకాణాలే బియ్యం అక్రమ తరలింపునకు అడ్డాగా నిలుస్తున్నాయి. లబ్ధిదారులు దుకాణానికి వచ్చిన సమయాన డీలర్లు బియ్యం కావాలా.. డబ్బు కావాలా అని అడుగుతుండడంతో చాలా మంది డబ్బులే తీసుకుంటున్నారు. కిలో బియ్యానికి రూ.5 నుంచి రూ.8 వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఆపై డీలర్లు, ఇంకొందరు లబ్ధిదారుల నుంచి దళారులు రూ.10 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**జిల్లా మీదుగా తరలింపు**

జిల్లా దళారులే కాక ఇతర ప్రాంతాల వ్యాపారులు సైతం ఖమ్మం మీదుగా ఇతర రాష్ట్రాలు, విదేశాలకు బియ్యం తరలిస్తున్నారు. దళారులు కొంత లాభం చూసుకుని వ్యాపారులకు విక్రయిస్తుండగా.. భారీగా పోగయ్యాక వ్యాపారులు రీసైక్లింగ్ చేయించి లారీలు, ఇతర వాహనాల్లో గుట్టుచప్పుడు కాకుండా పక్క రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఇలా దందా నిరాటంకంగా సాగుతూనే ఉంది. ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి పేదలకు బియ్యం పంపిణీ చేస్తుంటే.. దళారులు వీటిని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారు.

**97 కేసులు.. 2,949 క్వింటాళ్ల సీజ్**

గత ఏడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు బియ్యం అక్రమంగా తరలించిన ఘటనలపై పౌర సరఫరాల సంస్థ పరిధిలో 6ఏ కేసులు 97నమోదయ్యాయి. ఈ కేసుల్లో 2,949.81 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేశారు. ఆ ఏడాది అక్టోబర్‌లో ఏడు కేసులు నమోదు కాగా 464.40 క్వింటాళ్లు, జూలైలో 15 కేసులు నమోదు చేసి 385.35 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. అయితే, జిల్లాలో నమోదైన 6ఏ కేసుల్లో ఎక్కువగా బియ్యానికి సంబంధించినవే ఉండడం గమనార్హం.

**రెండు రోజుల్లో భారీగా..**

కారేపల్లి మండలం లలితాపురం వద్ద రెండు వాహనాల్లో తరలిస్తున్న 28.8 టన్నుల బియ్యాన్ని ఆదివారం అర్ధరాత్రి ఖమ్మం ఏసీపీ ఆధ్వర్యాన తనిఖీల్లో పట్టుకున్నారు. ఇల్లెందు నుంచి ఖమ్మం తరలిస్తుండగా ఈ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో నిందితులను వేపలగడ్డ, ఇల్లెందు వాసులుగా గుర్తించారు. అలాగే, ఖమ్మం ఇండస్ట్రియల్ ఏరియాలోని ఓ గోదాంలో నిల్వ చేసిన 600బస్తాల రేషన్ బియ్యాన్ని మంగళవారం ఖమ్మం అర్బన్ పోలీసులు సీజ్ చేశారు. ఇలా పోలీసులు తమకు సమాచారం అందినప్పుడు, సాధారణంగా చేపట్టే వాహనాల తనిఖీల్లో బియ్యం పట్టుబడుతుండగా సివిల్ సప్లయీస్ అధికారులకు అప్పగిస్తున్నారు. అయితే, పోలీసులే కాకుండా సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపడితే దందాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడే అవకాశముంటుంది.

### మరింతగా దృష్టి సారిస్తే..

రేషన్ బియ్యం జిల్లా సరిహద్దులు దాటుతున్నా సివిల్ సప్లయీస్, పోలీసు అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతిరోజు లారీలు, ఇతర వాహనాల్లో పీడీఎస్ బియ్యం తరలుతూనే ఉన్నా అరకొర దాడులు, తూతూమంత్రంగా కేసులతో సరిపెడుతున్నారనే చర్చ సాగుతోంది. రెవెన్యూ, పోలీస్, పౌర సరఫరాల సంస్థ అధికారులు గట్టి నిఘా పెడితే తప్ప దందాకు అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదనే చర్చ జరుగుతోంది. అయితే బడా వ్యాపారులు బియ్యాన్ని తరలించే సమయాన కొందరు అధికారులు వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

### నిఘా పెట్టాం..

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా పెట్టాం. అక్రమంగా దారి మళ్లించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటున్నాం. అన్ని రేషన్ షాపుల నుంచి ప్రతీనెల స్టాక్ వివరాలు తెప్పించుకుంటున్నాం. టాస్క్‌ఫోర్స్ బృందాలతోనూ తనిఖీ చేయిస్తున్నాం. ప్రజల నుంచి ఫిర్యాదులు అందినా తక్షణమే స్పందిస్తున్నాం. – చందన్‌కుమార్, డీఎస్‌ఓ

# పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళిక



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీసీఎఫ్ భీమానాయక్ తదితరులు

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

ఎర్రుపాలెం: అడవులు, గుట్టలు కేంద్రంగా ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళిక రూపొందించామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఎర్రుపాలెం మండలం జమలాపురంలో రూ.5.83 కోట్లతో నిర్మించే అటవీ పార్కు పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా భట్టి మాట్లాడుతూ దేశ పర్యాటక రంగంలో ఎర్రుపాలెం మండలానికి ప్రత్యేక స్థానం ఉండేలా అభివృద్ధి చేస్తామన్నారు. ఏళ్లుగా జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ పరిసర ప్రాంతాల అభివృద్ధిని ప్రజలు ఆకాంక్షిస్తున్నందున గతంలో జమలాపురం చెరువును ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేశామన్నారు. అయితే, గత ప్రభుత్వ హయాంలో ఆశించిన రీతిలో నిధులు మంజూరు కాలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున అడవులను ధ్వంసం చేయకుండా అవసరమైన అభివృద్ధికి రంగం సిద్ధం చేశామని భట్టి తెలిపారు. తద్వారా ప్రజలకు ఆదాయం పెరుగుతుందని, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ఆరు నెలల్లోగా అటవీ పార్కును అందుబాటులోకి తీసుకురావాలని ఫారెస్టు అధికారులను ఆయన ఆదేశించారు. అలాగే, బుచ్చిరెడ్డిపాలెం చెరువు, మామునూరుపేట చెరువులను టూరిజం స్పాట్లుగా అభివృద్ధి చేస్తామన్నారు. కాగా, సంక్రాంతి తర్వాత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మొదలవుతాయని, ఈ అంశంలో దరఖాస్తుల ఆధారంగా సర్వే చివరి దశకు చేరిందని భట్టి తెలిపారు. తొలుత మండల కేంద్రంలో రూ.18 కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు విస్తరణ, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులతో పాటు రూ.10 కోట్లతో నిర్మించనున్న గట్లగౌరారం – సత్యనారాయణపురంలో రహదారి పనులే కాక వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమానాయక్, అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ఆర్డీఓ నర్సింహారావు, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీపీఓ ఆశాలతతో పాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు శీలం ప్రతాపరెడ్డి, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, బండారు నర్సింహారావు, యరమల పూర్ణచంద్రారెడ్డి, బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, కడియం శ్రీనివాసరావు, మల్లెల లక్ష్మణరావు, షేక్ ఇస్మాయిల్, శీలం శ్రీనివాసరెడ్డి, తల్లపురెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మంచు ముసుగు!



జిల్లా కేంద్రంలోని ఇల్లెందు రోడ్డు ఇది. మంగళవారం రాత్రి 9గంటలకే ఇలా మంచుతెరలు కమ్మేయడంతో వివిధ పనులపై బయటకు వచ్చిన వారు చలికి వణికిపోయారు. అంతేకాక వాహనదారులు సైతం ఇక్కట్లు ఎదుర్కొన్నారు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## న్యూస్‌రీల్

### 11నుంచి నీటి సరఫరా నిలిపివేత



కాల్వలో నీటి సరఫరాను పరిశీలిస్తున్న ఎస్‌ఈ

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్ నుంచి యాసంగి పంటల సాగుకు నీరు విడుదల చేస్తుండగా వారబందీ విధానంలో భాగంగా ఈనెల 11నుంచి ఆరు రోజుల పాటు నిలిపివేయనున్నారు. ఈవిషయాన్ని జలవనరుల శాఖ ఎస్‌ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు వెల్లడించారు. మండలంలోని పాలేరు రిజర్వాయర్‌ను మంగళవారం పరిశీలించిన ఆయన పూర్తిస్థాయి నీటిమట్టం, కాల్వల ద్వారా సరఫరా వివరాలు ఆరా తీశారు. అలాగే, కాల్వకు గండ్లు పడిన ప్రాంతాలను పరిశీలించి మరమ్మతులపై సూచనలు చేయగా, యూటీ వద్ద నీరు ఎత్తిపోస్తున్న మోటార్ల పనితీరును పరిశీలించారు. వారబందీ విధానంలో విడుదలవుతున్న నీటిని రైతులు పొదుపుగా వాడుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు మధు, రత్నకుమారి పాల్గొన్నారు.

### రేపు అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి బాలికల అండర్-19 క్రికెట్ జట్టు ఎంపికకు ఈనెల 9న పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా సంఘం కార్యదర్శి ఎం.డీ.మూసాకలీం తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఉదయం 9గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈ మేరకు బాలికలు గుర్తింపు కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో హాజరుకావాలని తెలిపారు.

### మిర్చి విక్రయాలు సజావుగా సాగేలా ఏర్పాట్లు

ఖమ్మంసహకారనగర్: మిర్చి సీజన్ మొదలవుతున్నందున విక్రయాలు సాఫీగా సాగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన మిర్చి కొనుగోళ్లు, హోంగార్డుల కేటాయింపు, ధరల నిర్ణయం, ఫైర్ ఇంజన్ కేటాయింపు తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఖమ్మం మార్కెట్‌కు జిల్లాతో పాటు సూర్యాపేట, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల నుంచి రైతులు మిర్చి తీసుకొచ్చే అవకాశమున్నందున అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు మిర్చి గ్రేడింగ్ యంత్రాలు సమకూర్చుకోవాలని తెలిపారు. అలాగే, అదనంగా సిబ్బందిని నియమించుకోవడమే కాక భద్రత కోసం 20 మంది హోంగార్డులను కేటాయించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య రాకుండా రాకపోకలను నియంత్రించాలని, అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీం, ఏసీపీ యూ.ఎస్.రాజు, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ షఫీఉల్లా, డీఏఓ డి.పుల్లయ్య, జిల్లా అగ్నిమాపక అధికారి బి.అజయ్‌కుమార్, ఖమ్మం మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మంచుకొండ లిఫ్ట్‌కు త్వరలోనే శంకుస్థాపన



పైపులైన్ అలైన్‌మెంట్ పరిశీలిస్తున్న అధికారులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలానికి సాగర్ జలాలు అందించేందుకు ప్రధాన కాల్వలపై మంచుకొండ ఎత్తిపోతల పథకం నిర్మించనుండగా అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఈమేరకు మంగళవారం జలవనరుల శాఖ డీఈ ఝాన్సీ, ఏఈ శ్రీరాం ఆధ్వర్యాన వీ.వీ.పాలెం నుంచి చింతగుర్తి వరకు ప్రధాన పైపులైన్ నిర్మాణానికి సర్వే చేశారు. రూ.66 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే ఈ పథకం ద్వారా మండలంలోని 30 చెరువులకు నీరు ఎత్తిపోసి 2,400కు పైగా ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. సంక్రాంతి రోజున శంకుస్థాపన చేస్తానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో ప్రకటించడంతో త్వరలోనే కార్యక్రమం ఉంటుందని తెలుస్తోంది. ఈనేపథ్యాన సర్వే అనంతరం డీఈ ఝాన్సీ మాట్లాడారు. సుమారు 9 కి.మీ. మేర మంచుకొండ వరకు ప్రధాన పైపులైన్, అక్కడి నుంచి మరో 25 కి.మీ. మేర చెరువులకు పంపిణీ చేసేలా లింక్ పైపులైన్లు ఉంటాయని తెలిపారు. సుమారు 38.59 క్యూసెక్కుల సాగర్ జలాలు వాడుకునేలా ఈ పథకానికి రూపకల్పన చేస్తున్నట్లు వెల్లడించారు.

# సంక్రాంతి, కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

ఖమ్మం రాపర్తినగర్: సంక్రాంతి పండగతో పాటు ప్రయాగలో జరగనున్న మహా కుంభమేళాకు వచ్చివెళ్లే ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను నడిపించనున్నారు. ఈ రైళ్ల ఖమ్మం మీదుగా రాకపోకలు సాగిస్తాయని ఖమ్మం రైల్వే కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ ఎం.డీ.జాఫర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఆయన వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

**సంక్రాంతికి...**

సంక్రాంతి పండుగ సందర్భంగా చర్లపల్లి–తిరుపతి నడుమ నడిచే ప్రత్యేక రైలు ఈనెల 8, 11వ తేదీల్లో రాత్రి 22–18 గంటలకు, తిరుపతి–చర్లపల్లి రైలు జనవరి 10, 13, 17వ తేదీల్లో అర్ధరాత్రి 12–44గంటలకు ఖమ్మం వచ్చి వెళ్తాయి. నాందేడ్–కాకినాడ మధ్య ఈనెల 14న అర్ధరాత్రి 1–38గంటలకు, కాకినాడ–నాందేడ్ మధ్య ఈనెల 8, 15న అర్ధరాత్రి 1–24గంటలకు, కాచిగూడ–తిరుపతి మధ్య నడిచే ప్రత్యేక రైలు ఈనెల 9, 16వ తేదీల్లో రాత్రి 9–52గంటలకు ఖమ్మం చేరుకుంటుంది.

**కుంభమేళాకు...**

విజయవాడ–గయా ప్రత్యేక రైలు(07093) ఫిబ్రవరి 5న రాత్రి 9–43గంటలకు, సీసీటీ–గయా ప్రత్యేక రైలు(07095) ఫిబ్రవరి 8న రాత్రి 9–43గంటలకు ఖమ్మం చేరుకుని బయలుదేరనున్నాయి. అలాగే, గుంటూరు నుంచి ఆజాంగఢ్ వెళ్లే ప్రత్యేక రైలు(07081) ఫిబ్రవరి 15న అర్ధరాత్రి 1–58గంటలకు, అజాంగఢ్–విజయవాడ ప్రత్యేక రైలు(07082) ఫిబ్రవరి 18న తెల్లవారు జామున 4–20గంటలకు, సీసీటీ–ఆజాంగఢ్ ప్రత్యేక రైలు(07085) ఫిబ్రవరి 21న అర్ధరాత్రి 1–58గంటలకు, ఆజాంగఢ్–విజయవాడవెళ్లే రైలు(07086) ఫిబ్రవరి 24న తెల్లవారుజామున 3–43గంటలకు ఖమ్మం చేరుకుని గమ్యస్థానాలకు బయలుదేరతాయి.

# శరవేగంగా ఖిల్లాపైకి రోప్‌వే నిర్మాణం

- అక్కడే రెస్టారెంట్, మినీ థియేటర్ కూడా..
- పర్యాటక అభివృద్ధిపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం ఖిల్లాను రాష్ట్రానికే తలమానికంగా నిలిపేలా అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన నేలకొండపల్లి బౌద్ధస్థూపం, భక్తరామదాసు ధ్యాన మందిరం అభివృద్ధితో పాటు ఖిల్లాపైకి రోప్‌వే నిర్మాణం, ఇతర పనులపై తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్, ఎండీ ప్రకాష్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖిల్లాపైకి పర్యాటకులు సులువుగా చేరుకునేలా రోప్‌వే నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. రోప్‌వే ప్రారంభ స్థానాన్ని లకారం పార్క్ వద్ద ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలన్నారు. అది సాధ్యం కాకపోతే పాత మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభించాలని తెలిపారు. కాగా, పనుల్లో రాజీ పడకుండా నాణ్యతకు పెద్దపీట వేయాలని చెప్పారు. ఇక ఖిల్లాపై అమ్యూజ్‌మెంట్ పార్కులు, రెస్టారెంట్, మినీ థియేటర్, షాపింగ్ కాంప్లెక్స్, వ్యూపాయింట్, వాటర్ ఫౌంటేన్ ఏర్పాటుచేయాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. పర్యాటక శాఖకు అవసరమైన భూమిని త్వరగా అప్పగించాలని, సుందరీకరణ పనులకు అవసరమైన నిధులను కేఎంసీ నుంచి మంజూరు చేయాలని సూచించారు. ఇందుకోసం నియోజకవర్గ అభివృద్ధి నిధులను సైతం కేటాయిస్తానని మంత్రి వెల్లడించారు.

# సంక్రాంతికి ఆర్టీసీ రెడీ

- ఖమ్మం రీజియన్ నుంచి 1,030 బస్సుల రాకపోకలు
- ఏడు డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు
- ఈనెల 9నుంచి 19వ తేదీ వరకు అందుబాటులో..
- రద్దీకి అనుగుణంగా సంఖ్య పెంచేలా ఏర్పాట్లు



ఖమ్మంమయూరిసెంటర్: సంక్రాంతి పండుగకు ఆర్టీసీ సిద్ధమైంది. పండుగకు స్వస్థలాలకు వచ్చివెళ్లే ప్రజల కోసం ప్రత్యేక బస్సులు నడిపించేలా ప్రణాళిక రూపొందించింది. ఖమ్మం రీజియన్‌లో ఏడు డిపోల నుంచి 1,030 బస్సులను నడపనున్నారు. గత అనుభవాల ఆధారంగా ఈ సంక్రాంతికి ముందుగానే ప్రత్యేక సర్వీసులు మొదలుపెట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈనెల 9వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి. కాగా, అవసరమైతే 20వ తేదీన కూడా ఈ సర్వీసులు కొనసాగిస్తారు. అయితే, అదనపు సర్వీసుల్లో సాధారణ బస్సులతో పోలిస్తే చార్జీలు పెంచాలని సంస్థ నిర్ణయించినట్లు తెలిసింది.

**రద్దీకి అనుగుణంగా..**

విద్య, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం వివిధ ప్రాంతాల్లో ఉండేవారు సంక్రాంతికి స్వస్థలాలకు రావడం ఆనవాయితీ. ఈనేపథ్యాన రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఖమ్మం రీజియన్ అధికారులు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వచ్చే ప్రయాణికుల కోసం ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు 585 బస్సులు నడిపించనున్నారు. అలాగే, తిరుగు ప్రయాణంలో ఈనెల 15 నుంచి 19వరకు ఉమ్మడి జిల్లా నుండి హైదరాబాద్‌కు 445 బస్సులు నడిపిస్తారు. ఇందులో రీజియన్ పరిధిలోని బస్సులతో సిటీ సర్వీసులు కూడా ఉంటాయి. ఇక పండుగ రోజులైన 11, 12వ తేదీల్లో వీటికి తోడు మరో 135 బస్సులు తిప్పుతారు. అలాగే, రద్దీ ఎక్కువగా ఉంటే అప్పటికప్పుడు అదనపు బస్సులు ఏర్పాటుచేసేలా ప్రణాళిక రూపొందించారు.

**రిజర్వేషన్ సౌకర్యం కూడా..**

సంక్రాంతి పండుగకు ఆర్టీసీ నడిపే అదనపు బస్సుల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. సొంత ఊర్లకు వెళ్లివచ్చే వారు www.tgsrtcbus.in వెబ్‌సైట్ ద్వారా సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చు. అలాగే, సమీపంలోని బస్టాండ్లలో కూడా సీట్లు రిజర్వేషన్ చేసుకునే వెసలుబాటు కల్పించారు. అయితే, రిజర్వేషన్‌తో పాటు రిజర్వేషన్ లేకుండా బస్సులు ఉంటాయని అధికారులు తెలిపారు.

**బస్సు సర్వీసుల సమాచారం కోసం సంప్రదించాల్సిన నంబర్లు...**

| డిపో | సెల్ నంబర్ |
|---|---|
| ఖమ్మం కొత్త బస్టాండ్ | 99592 25979 |
| ఖమ్మం పాత బస్టాండ్ | 99592 25965 |
| సత్తుపల్లి | 99592 25990 |
| మణుగూరు | 89853 61796 |
| కొత్తగూడెం | 99592 25982 |
| మధిర | 73829 25289 |
| భద్రాచలం | 99592 25987 |

**హైదరాబాద్ నుంచి ఖమ్మం రీజియన్‌కు నడిపించే ప్రత్యేక బస్సుల సంఖ్య**

| తేదీ | బస్సులు | తేదీ | బస్సులు |
|---|---|---|---|
| 9 | 40 | 12 | 135 |
| 10 | 130 | 13 | 100 |
| 11 | 135 | 14 | 45 |

**రీజియన్ నుంచి హైదరాబాద్‌కు నడిపే బస్సుల సంఖ్య**

| తేదీ | బస్సులు | | |
|---|---|---|---|
| 15 | 125 | 17 | 80 |
| 16 | 120 | 18 | 60 |
| | | 19 | 60 |

### ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా..



హైదరాబాద్ నుంచి ఖమ్మం రీజియన్‌కు, మళ్లీ హైదరాబాద్‌కు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందనే భావనతో నాన్‌స్టాప్ సర్వీసులు ఏర్పాటు చేస్తున్నాం. అలాగే, ఖమ్మం నుంచి మణుగూరు, భద్రాచలం, సత్తుపల్లి, కొత్తగూడెం, మధిర, ఇల్లెందు తదితర ప్రాంతాలకు బస్సులు నిరంతరం అందుబాటులో ఉంటాయి. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే మా లక్ష్యం. ప్రజలు కూడా ప్రైవేట్ వాహనాల్లో కాకుండా ఆర్టీసీలో ప్రయాణించాలి.

– ఏ.సరిరామ్, ఖమ్మం రీజినల్ మేనేజర్

# మరింత వేగంగా 'సీతారామ'

**కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



మ్యాప్ ద్వారా పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంసహకారనగర్: సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు వేగం పెంచి త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు పూర్తయిన ప్రాజెక్టు పనులు, భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. సత్తుపల్లి ట్రంక్, యాతాలకుంట టన్నెల్, జూలూరుపాడు టన్నెల్, పంప్ హౌస్‌ల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం, పాలేరు నియోజకవర్గంలో లింక్ కెనాళ్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ తదితర అంశాలపై ఆరా తీశారు. భూసేకరణపై నిర్వాసితులతో సంప్రదించి త్వరగా పూర్తిచేయాలని, అటవీ భూములపై ఆ శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్వో ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### యూరియా కోసం పడిగాపులు



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

**చింతకాని:** చింతకానిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం వద్ద యూరియా కోసం రైతులు మంగళవారం బారులు దీరారు. మండలంలోని డీలర్లకు యూరియా సరఫరా నిలిపివేయడంతో కొరత ఏర్పడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మొక్కజొన్న, వరికి యూరియా తప్పనిసరి కాగా, చింతకాని సొసైటీకి 80 టన్నుల యూరియా వచ్చింది. ఈ విషయం తెలియగానే సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులు క్యూ కట్టారు. యూరియా కోసం వచ్చిన రైతులందరికీ సరఫరా చేయగా, ఇంకా 20 టన్నుల స్టాక్ ఉందని సొసైటీ సీఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

### ఏఈ ఉద్యోగం సాధించిన యువకుడు



నియామకపత్రం అందుకుంటున్న సతీష్

**ఖమ్మంఅర్బన్:** ఖమ్మం 6వ డివిజన్‌కు చెందిన కుర్రా సతీష్ ట్రాక్టర్ అద్దెకు తిప్పుతూ జీవనం సాగిస్తూనే కష్టపడి చదివి ప్రభుత్వం ఉద్యోగానికి ఎంపికయ్యాడు. నిరుపేదలైన కుర్రా కోటేశ్వరరావు – రాజేశ్వరి దంపతుల కుమారుడైన సతీష్ తండ్రి ట్రాక్టర్ కిరాయికి తిప్పుతూ మరోపక్క ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యాడు. తాజాగా ఆయన కేటీపీఎస్ 7వ యూనిట్‌లో ఏఈగా ఎంపికై నియామకపత్రం అందుకోగా కుటుంబసభ్యులు, కాలనీవాసులు అభినందించారు.

### మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా సౌజన్య



సౌజన్య

**ఖమ్మంవన్‌టౌన్:** మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా దొబ్బల సౌజన్య రెండోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు సౌజన్య మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు సునీతారావుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడించారు.

### రేపు వాహనాల వేలం

**ఖమ్మంక్రైం:** ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్‌-2లో పట్టుబడిన ఐదు వాహనాలను ఈనెల 9న వేలం వేయనున్నట్లు సీఐ చంద్రమోహన్ తెలిపారు. ఖమ్మం గట్టయ్య సెంటర్‌లోని ఎక్సైజ్ స్టేషన్‌–1లో 9వ తేదీన ఉదయం 10గంటలకు వేలం ఉంటుందని వెల్లడించారు.

### కాల్వలో విద్యార్థి మృతదేహం లభ్యం

**కల్లూరురూరల్:** కల్లూరు మండలం పడమర లోకారం సమీపాన సాగర్ ప్రధాన కాల్వ వద్ద గత ఆదివారం సెల్ఫీ తీసుకుంటూ ప్రమాదవశాత్తు గల్లంతైన విద్యార్థి పరిమి శివ(17) మృతదేహం మంగళవారం లభించింది. ప్రమాదం జరిగిన ప్రాంతానికి కొద్దిదూరాన ఎన్నెస్పీ పాత బ్రిడ్జి వద్ద శివ మృతదేహం చెట్ల పొదల్లో చిక్కుకుని ఉండగా చూసిన వారు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో కల్లూరు ఎస్సై హరిత ఆధ్వర్యాన సిబ్బంది వెళ్లి మృతదేహాన్ని తీయించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### అన్నను గుంజకు కట్టేసిన తమ్ముడు

**రఘునాథపాలెం:** మండలంలోని వీ.వీ.పాలెంలో ఆస్తి విషయమై ఏర్పడిన తగాదాలో అన్నను తమ్ముడు గుంజకు కట్టేసిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాంబాబు తన వాటాగా వచ్చిన ఇంటి స్థలాన్ని అమ్ముకునేందుకు సిద్ధమయ్యాడు. దీనికి నిరాకరించిన ఆయన తమ్ముడు బాబు ఘర్షణ పడడమే కాక రాంబాబును ఇంట్లో గుంజకు కట్టేశాడు. సమాచారం తెలిసిన పెద్ద మనుషులు, పోలీసులు వెళ్లి ఆయనను విడిపించారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

### ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

| | గరిష్ట | కనిష్ట |
|---|---|---|
| మిర్చి | 15,600 | 5,500 |
| మిర్చి తాలు | 6,300 | 4,700 |
| ఏసీ మిర్చి | 15,300 | 5,000 |
| ఏసీ తాలు | 6,500 | 6,000 |
| పత్తి | 7,200 | 6,000 |

– ఖమ్మం వ్యవసాయం

### పామాయిల్ గెలలు

| | |
|---|---|
| టన్ను ధర | రూ.20,506 |

# సుందర రూపం.. బలరామావతారం



స్వామి వారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

**నేడు వైభవంగా ఊంజల్ సేవ**

**భద్రాచలం :** శేష తల్పమున సేద తీరి రెండు చేతుల్లో శంఖు చక్రాలు, మరో రెండు చేతుల్లో నాగలి, గదతో దర్శనమిచ్చిన బలరామావతారం బహుసుందరమని కొనియాడుతూ భక్తులు జేజేలు పలికారు. శ్రీహరికి శయన అయిన ఆదిశేషుని అంశతో జన్మించి, శ్రీకృష్ణునికి అన్నగా ఆయనకు ధర్మస్థాపనలో సహకరిస్తూ, అపర పరాక్రముడిగా పేరొందిన బలరాముడి అవతారంలో స్వామివారు దర్శనమిచ్చారు. పగల్ పత్తు ఉత్సవాల్లో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి మంగళవారం ఈ రూపంలో అలంకరించారు. తెల్లవారుజామున ప్రత్యేక పూజలు, సుప్రభాతం, ఆరాధన తదితర సేవలు జరిపించారు. బలరామావతారంలో అలంకరించిన స్వామివారిని భక్తుల సందర్శనార్థం కాసేపు బేడా మండపంలో వేంచేపు చేశారు. అనంతరం బాజాభజంత్రీలు, కోలాటాల నడుమ మిథిలా స్టేడియంలోని వేదికపైకి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అర్చకులు స్వామి వారికి నైవేద్యం, హారతి సమర్పించాక, భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. తిరువీధి సేవ అనంతరం స్వామివారిని తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు.

**నేడు కృష్ణావతారంలో దర్శనం..**

అధ్యయనోత్సవాల్లో భాగంగా భద్రాద్రి రామయ్య శనివారం శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దేవకీ వసుదేవులకు అష్టమ సంతానంగా జన్మించి, దుష్టులైన కంసుడు, నరకాసురుడు, శిశుపాలుడు మొదలైన వారిని వధించి, ధర్మవర్తనులైన పాండవుల పక్షం వహించి, కురుక్షేత్ర సంగ్రామంలో ఉపనిషత్తుల సారాంశమైన భగవద్గీతను అర్జునుడికి బోధించి మానవ ఆదర్శాలను, ధర్మాన్ని స్థాపించిన శ్రీమన్నారాయణుని పరిపూర్ణ అవతారం శ్రీకృష్ణావతారం. చంద్ర గ్రహ బాధలున్న వారు ఈ అవతారాన్ని దర్శించడం వలన శుభ ఫలితాలు పొందుతారని ప్రతీతి. ఈ సందర్భంగా బేడా మండపంలో కృష్ణావతారంలో ఉన్న స్వామివారికి వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించనున్నారు.



బలరామావతారంలో దర్శనమిస్తున్న స్వామి వారు

# వచ్చేనెలలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న రాంనారాయణ

**వైరా:** ఫిబ్రవరిలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా మహాసభలను వైరాలో నిర్వహించనున్నామని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ తెలిపారు. వైరాలో మంగళవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన సీఎం రేవంత్‌రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యానికి హెల్త్‌కార్డుల మంజూరు కోసం హామీ ఇచ్చారని, ఇతర సమస్యలపైనా ప్రభుత్వం సానుకూలంగా ఉండగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి చేస్తామన్నారు. కాగా, జిల్లా మహాసభల విజయవంతానికి సహకరించాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లుతో పాటు ఏపూరి రాజారావు, నర్వనేని వెంకట్రావు, దాసరి శ్రీనివాసరావు, ఎం.బాబూరావు, ఎక్కిరాల శ్రీనివాసరావు, చెరుకుపల్లి శ్రీనివాసరావు, వేణుగోపాల్, జనార్దనాచారి, కల్యాణ్, శ్రీకాంత్, రవీందర్, అతావుల్లా, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

# ‘ప్రమాదకరంగా బీజేపీ మతోన్మాద విధానాలు’



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న సుదర్శన్‌రావు, నాగేశ్వరరావు

**బోనకల్:** బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలు దేశానికి అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. బోనకల్‌లోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను సీపీఎం వ్యతిరేకిస్తోందని తెలిపారు. జమిలీ ఎన్నికలు నిర్వహించాలన్న చర్చ కూడా అందులో భాగమేనని ఆరోపించారు. కాగా, పార్టీ రాష్ట్ర మహాసభల అనంతరం బీజేపీకి వ్యతిరేకంగా పోరుబాట పట్టనున్నట్లు తెలిపారు. కాగా, మండలంలోని తూటికుంట్లకు చెందిన ముప్పా వీరయ్య, బోనకకల్‌కు బిల్లా విశ్వనాథంకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబల్లి నర్సిరెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సుదర్శన్‌రావు, నాగేశ్వరరావు అందజేశారు. ఈ సమావేశంలో నాయకులు బంధం శ్రీనివాసరావు, పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరావు, దొండపాటి నాగేశ్వరావు, కిలారు సురేష్, తుళ్లూరు రమేష్, చిట్టిమోదు నాగేశ్వరావు, జొన్నలగడ్డ సునీత, వాణి, బంధం వెంకటరాజ్యం, తెల్లాకుల శ్రీనివాసరావు, నోముల పుల్లయ్య, ఉప్పర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన బియ్యమే సరఫరా చేయాలి..



పెద్దగోపతి పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

**అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశం**

**కొణిజర్ల:** మధ్యాహ్న భోజనానికి వినియోగించే బియ్యంలో పురుగులు వచ్చాయని ‘సాక్షి’లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మంగళవారం మండలంలోని పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. బియ్యం నిల్వలను పరిశీలించిన ఆమె ఎక్కడ నుంచి సరఫరా అయ్యాయని ఆరా తీయగా కొణిజర్ల, వైరా, తల్లాడ మండలాలకు వైరా ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి వస్తున్నాయని ఎంఈఓ అబ్రహం సమాధానమిచ్చారు. దీంతో వెంటనే బియ్యం మార్చుకోవాలని ఆదేశించిన అదనపు కలెక్టర్ వంట గది, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం వైరా ఎంఎల్ఎస్ పాయింట్‌కు వెళ్లిన ఆమె పూర్తిస్థాయిలో పరిశీలించాకే పాఠశాలలకు సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే, డీఈఓ సోమశేఖరశర్మ సింగరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి బియ్యం నాణ్యతపై ఆరా తీశారు.

**మెనూ ప్రకారం భోజనం అందించాలి**

**వైరారూరల్:** ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ఆధారంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఆదేశించారు. వైరా మండలం గరికపాడు హైస్కూల్‌ను తనిఖీ చేసిన ఆమె పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు, వంట గదిని పరిశీలించి మెనూ అమలుపై ఆరా తీశారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున 9, 10వ తరగతి విద్యార్థులపై శ్రద్ధ వహించాలని విద్యార్థులకు సూచించారు.

# అక్రమ బ్లాస్టింగ్‌పై అధికారుల కన్నెర్ర

- పొక్లెయినర్, కంప్రెషర్ ట్రాక్టర్ స్వాధీనం



మట్టి తవ్వకాలు చేపట్టిన ప్రాంతంలో పరిశీలిస్తున్న అధికారులు

**తిరుమలాయపాలెం:** తిరుమలాయపాలెంకు చెందిన నాగరాజు అనే వ్యక్తి తన కుటుంబీకులకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతుండడమే కాక బండరాళ్లను తొలగించేందుకు బాంబులు అమరుస్తున్నాడనే సమాచారంతో అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రామకృష్ణ, ఏఎస్ఐ శ్రీనివాసాచారి, హెడ్ కానిస్టేబుల్ హరి ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టి బండరాళ్లలో బాంబులు అమర్చేందుకు రంధ్రాలు చేస్తున్న కంప్రెషర్ ట్రాక్టర్, మట్టి తవ్వకాలు చేపడుతున్న పొక్లెయినర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, కంప్రెషర్, పొక్లెయినర్ల యజమానులు దేరంగి శ్రీను, జాలాది రాంబాబును ఎస్ఐ జగదీష్‌కు అప్పగించారు. ఈ విషయమై ఎస్ఐని వివరణ కోరగా ఘటనాస్థలంలో ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదని, రెవెన్యూ అధికారులతో కలిసి విచారించి బాధ్యులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

# కంప్యూటర్ సైన్స్ విభాగంలో డాక్టరేట్



వీరభద్రం

**కొణిజర్ల:** కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన వడ్లమాని వీరభద్రంకు జేఎన్‌టీయూ కాకినాడ నుంచి డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ డాక్టర్ అరుల్ డాల్టన్ పర్యవేక్షణలో ఆయన ‘యాన్ ఎఫిషియెంట్ మెథడ్ ఫర్ కీ యాగ్రిగేట్ సెర్చబుల్ ఎన్‌క్రిప్షన్ ఫర్ గ్రూప్ డేటా షేరింగ్ వయా క్లౌడ్ స్టోరేజీ’ అంశంపై సమర్పించిన పరిశోధనా గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. కేయూ నుంచి ఇంజనీరింగ్, జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో ఎంటెక్ చేసి వీరభద్రం ప్రస్తుతం హైదరాబాద్ సీఎంఆర్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు డాక్టరేట్ లభించడంపై పల్లిపాడు వాసులు అభినందించారు.



గుగులోతు రవి

**భాగ్యనగర్‌తండా వాసికి..**

**కారేపల్లి:** సింగరేణి మండలం సామ్యతండా వాసి గుగులోతు రవికి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. సీబీఐటీ ప్రొఫెసర్ స్వామిదాస్ పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు కారేపల్లి, మహబూబాబాద్‌లో చదివిన ఆయన ఇంటర్ ఖమ్మంలో, సత్తుపల్లిలో ఇంజనీరింగ్ పూర్తి చేయగా ప్రస్తుతం మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. సింగరేణి రిటైర్డ్ కార్మికుడైన గుగులోతు ధర్మా–దస్లీ దంపతుల కుమారుడు రవిని పలువురు అభినందించారు.

# రేవంత్‌రెడ్డి సారథ్యాన వర్గీకరణ సాధిద్దాం




మాట్లాడుతున్న పిడమర్తి రవి, పక్కన సోమచంద్రశేఖర్ తదితరులు

**ఖమ్మం మామిళ్లగూడెం:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంట నడవడం ద్వారా ఎస్సీ వర్గీకరణ సాధిద్దామని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పిడమర్తి రవి, వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ అన్నారు. ఖమ్మంలో మంగళవారం వారు మాట్లాడుతూ వచ్చేనెల 2న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వద్ద జరిగే మాదిగ యువజన విద్యార్థి గర్జనను విజయవంతం చేయాలని కోరారు. కాగా, మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు జిల్లాల వారీగా వర్గీకరణ చేయాలని కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో గెలుపోటములను నిర్ణయించేది మాదిగ సామాజిక వర్గమేనని తెలిపారు. అయితే, రెండు ఎస్సీ నియోజకవర్గాలు ఉన్నా మాదిగలకు ప్రాతినిధ్యం దక్కనందున ఎమ్మెల్సీ పదవులను కేటాయించేలా ఎమ్మెల్యేలు కృషి చేయాలని కోరారు. అంతేకాక నామినేటెడ్, పార్టీ పదవుల్లో మాదిగలకు జనాభా ప్రాతిపదికన కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో మాదిగ జేఏసీ ఉపాధ్యక్షుడు మట్టి గురుమూర్తి, తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ నర్సింహారావుతో పాటు తోళ్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# చకచకా మోడల్ ఇంటి నిర్మాణం



నిర్మాణం పూర్తి కావొచ్చిన మోడల్ గృహం



పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస్

**కూసుమంచి:** కూసుమంచిలోని తహసీల్ ఆవరణలో రూ.5లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటి హౌజ్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గతనెల 13న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భూమిపూజ చేయగా పనులు వేగంగా చేపడుతున్నారు. జిల్లాలో తొలి మోడల్ గృహం కావడంతో స్లాబ్ పూర్తిచేయగా, ప్లాస్టరింగ్ పనులు కొసాగుతున్నాయి. సంక్రాంతి నాటికి పూర్తిచేసి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి కేటాయించనున్న రూ.5లక్షల్లోనే ఈ ఇంటి నిర్మాణం పూర్తి కానుండడంతో లబ్ధిదారులు ఈ మోడల్‌పైనే మొగ్గు చూపే అవకాశముందని తెలుస్తోంది. కాగా, ఇంటి నిర్మాణ పనులను మంగళవారం గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్ పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రంలోనే తొలిసారిగా కూసుమంచిలో ఇంటి నిర్మాణం పూర్తికానుందని తెలిపారు. ఇన్‌చార్జి తహసీల్దార్ కరుణశ్రీ, గృహ నిర్మాణ శాఖ ఏఈ ఉమామహేశ్వరరావు, కాంట్రాక్టర్ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

# సాధారణ ప్రసవాల పెంపునకు కౌన్సెలింగ్



మాటూరుపేట పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

**మధిర/కల్లూరు:** గర్భిణులతో పాటు వారి కుటుంబీకులకు సాధారణ కాన్పులతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి సూచించారు. మధిర మండలం మాటూరుపేట పీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేసిన ఆమె జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గర్భిణులను ప్రతీనెలా పరీక్షిస్తూ మందులు వాడేలా పర్యవేక్షించాలని, సాధారణ కాన్పుల సంఖ్య పెరిగేలా కృషి చేయాలని తెలిపారు. అలాగే, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. కాగా, డీఎంహెచ్‌ఓ కల్లూరులోని డాక్టర్ మాధవి ప్రసూతి ఆస్పత్రిని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి లింగనిర్ధారణ పరీక్షలు, ఇతర నిబంధనలపై సూచనలు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సీతారామ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవ్యకాంత్ పాల్గొన్నారు.

# అధునాతన విధానాలతో మత్స్యకారులకు లబ్ధి



మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్

**నేలకొండపల్లి:** మత్స్యకారులు సంప్రదాయ విధానాలకు తోడు అధునాతన పద్ధతులు అవలంబించడం ద్వారా చేపల ఉత్పత్తి పెరుగుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు. మండలంలోని బైరవునిపల్లిలో మత్స్యకారులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసమావేశంలో శివప్రసాద్ మాట్లాడుతూ కాలానుగుణంగా మత్స్యకారులు అధునాతన విధానాలపై అవగాహన పెంచుకోవాలని, ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, శాస్త్రవేత్తలు రమేష్ రాథోడ్, అజిత్ కేశవ్, ఉద్యోగులు రాజు, శంకర్, చేపల పెంపకందారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దపాక రామదాసు, పెద్దపాక వెంకటేశ్వర్లుతో పాటు పెద్దపాక వెంకటేశ్వర్లు, పెద్దపాక మదారు, పి.వెంకటేశ్వర్లు, ముత్తయ్య, రాములు, జక్కరయ్య పాల్గొన్నారు.

# హాస్టల్‌లో సోషల్ వెల్ఫేర్ డీడీ బస



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీడీ సత్యనారాయణ

**ఎర్రుపాలెం:** మండలంలోని బనిగండ్లపాడు ఎస్సీ బాలుర వసతి గృహంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ మంగళవారం రాత్రి బస చేశారు. తొలుత హాస్టల్ విద్యార్థులతో మాట్లాడిన ఆయన మెనూ అమలు, అందుబాటులో ఉన్న వసతులపై ఆరా తీశారు. అలాగే, పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా శ్రద్ధగా చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసిన డీడీ అక్కడే నిద్రించారు. ఏఎస్‌డబ్ల్యూఓ కొత్తా వెంకటేశ్వరరావు, వార్డెన్ టి.దశరథ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

### ప్రేమ పెళ్లికి నిరాకరించడంతో యువకుడి ఆత్మహత్య

**కామేపల్లి:** ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకునేందుకు ఆమె తల్లిదండ్రులు నిరాకరించడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కామేపల్లి ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాలు.. మండలంలోని రేపల్లేవాడకు చెందిన బానోత్ నెహ్రూ(23) అదే గ్రామానికి చెందిన యువతిని ఏడాదిగా ప్రేమిస్తున్నాడు. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుని యువతి తల్లిదండ్రులు తెలపగా వారు నిరాకరించారు. దీంతో మనస్తాపానికి గురైన నెహ్రూ ఈనెల 3న ఇంట్లో పురుగుల మందు తాగడంతో కుటుంబీకులు ఖమ్మం తరలించి చికిత్స చేయిస్తుండగా సోమవారం మృతి చెందాడు. ఘటనపై ఆయన తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### 600బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

**ఖమ్మంఅర్బన్:** ఖమ్మం ఖానాపురం పారిశ్రామిక ప్రాంతంలోని గోదాం(పాత రైస్‌మిల్లు)లో అక్రమంగా నిల్వ చేసిన 600 బస్తాల రేషన్ బియ్యాన్ని మంగళవారం ఖమ్మం అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ భాను ప్రకాష్ తెలిపిన వివరాలు.. పాత రైస్ మిల్లులో రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు అందిన సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈమేరకు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయీస్ డీటీ విజయ్‌బాబుకు అప్పగించగా, ఎక్కడి నుంచి ఎవరు సేకరించారు.. ఎక్కడకు తరలించనున్నారనే అంశంపై విచారణ చేస్తున్నారు. కాగా, ఈ కేసులో షేక్ నజీర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసినా, రవాణా చేసినా నిందితులపై కేసులు నమోదు చేయడంతో పాటు పలుమార్లు పట్టుబడితే పీడీ యాక్ట్ కేసు పెడతామని సీఐ తెలిపారు.

### రెండు ఇసుక లారీల సీజ్

**నేలకొండపల్లి:** ఏపీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను నేలకొండపల్లి పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా రెండు లారీల్లో ఇసుక హైదరాబాద్ తరలిస్తుండగా తనిఖీల్లో పట్టుబడింది. ఈమేరకు లారీలను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


## సాక్షి క్లాసిఫైడ్స్




■ ఖమ్మం, సహకార నగర్, లయన్స్ క్లబ్ బిల్డింగ్ నందు కుట్టు మిషన్, బ్యూటీషియన్ & కంప్యూటర్ కోర్స్ నేర్పబడును. ఆసక్తిగల అభ్యర్థులు సం।। 9848156328 [M-1256031]




BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల వ్యాపార, ప్రాజెక్టుల, వ్యక్తిగత, వ్యవసాయ, విద్య రుణాల సలహాలకు సంప్రదించండి DMA స్వాగతం. జీతం + కమీషన్. ✆ 9671637906. [T-297]

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694. [SCA25001023]




■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256029]

■ బజాజ్ కంపెనీ నందు పని చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. వివరాలకు సంప్రదించండి. సెల్ : 99516 63755, 94903 54936. [M-1253805]

■ హరేకృష్ణ హోం కేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K. Ph: 9640468899, 9640258899 [SCA25001049]

■ కేర్‌టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలో పేషెంట్లను ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు ప్రముఖ హోమ్‌కేర్ సంస్థకు కావలెను. మంచి జీతం+వ+ భో ✆ 91608 35559, 78158 35561 [B-432]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

| | |
|---|---|
| ఖమ్మం | 9010299957, 9705444182 |
| కొత్తగూడెం | 9010223783 |
| పాల్వంచ | 9705444183 |
| భద్రాచలం | 9951602914 |
| మణుగూరు | 9705944416 |
| సత్తుపల్లి | 9652868642 |
| మధిర | 9949927792 |

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే (GST 5% అదనం)


## గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.